సాక్షి కామారెడ్డి

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



పరిష్కారం చూపాలి

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



రైతు కష్టం కన్నీటి పాలు

జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం కురిసిన వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్ద య్యింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /21.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు న్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బంగారం @ 81వేలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బంగారం ధర రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. సోమవారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ 81 వేలకు చేరిఆల్ టైం హై రికార్డు సృష్టించింది. పెళ్లిళ్ల సీజన్ ఆరంభంలో ధరలు భారీగా పెరగడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. ధర ఇలాగే పెరిగితే కొనలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్‌రూం ప్రారంభం



కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు తలెత్తితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం(08468 -220051)కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, మార్కెటింగ్ అధికారి రమ్య పాల్గొన్నారు.

నేడు చెరువులో చేప పిల్లల విడుదల

కామారెడ్డి అర్బన్: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి పెద్ద చెరువులో మంగళవారం తొలివిడతగా యాభై శాతం చేప పిల్లలను విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమాన్ని చెరువు పరిధిలోని మత్స్యకారులు విజయవంతం చేయాలని కోరారు.

నిజాంసాగర్‌లోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల సోమవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.802 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా గంగాధర్



నిజామాబాద్ సిటీ: తెలంగాణ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌కు చోటు దక్కింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు ఏడుగురు సభ్యులను నియమించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోదండరెడ్డి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిషన్‌లో సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఎం సునీల్‌కుమార్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గడుగు గంగాధర్, కేవీ నర్సింహారెడ్డి, చెవిటి వెంకన్నా యాదవ్, మారికంటి భవాని సభ్యులుగా ఉన్నారు.

తెయూ అభివృద్ధికి కృషి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీని బోధన, పరిశోధనల్లో బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని వర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన వర్సిటీ పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్‌లో తెయూ ఐదో శాశ్వత వీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించుకుని యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీ ఏర్పాటైన 18 ఏళ్లలో ఒకసారి మాత్రమే స్నాతకోత్సవం నిర్వహించారని, త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని వీసీ తెలిపారు.

పిండానికి గండం!



చట్టాల్లోని లొసుగులను ఆసరా చేసుకుని స్కానింగ్, అబార్షన్ మాఫియా రెచ్చిపోతోంది. మరోవైపు ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమీ చేయలేక నిస్తేజంలో ఉండిపోతోంది. స్కానింగ్ దందా దర్జాగా నడుస్తున్నా అధికారులు గట్టి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

- జిల్లాలో విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు
- ఆడపిల్లల్ని కడుపులోనే తుంచేస్తున్న దుర్మార్గులు
- కేసులకు జడవని స్కానింగ్ మాఫియా
- సమాజానికి సవాల్‌గా మారిన స్కానింగ్‌లు, అబార్షన్‌లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లకు కామారెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కొందరు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ కడుపులో పెరుగుతున్నది ఆడో, మగో చెప్పి అడ్డంగా సంపాదిస్తున్నారు. ఆడపిల్ల వద్దనుకునే తల్లిదండ్రులు అబార్షన్‌కు ముందుకు వస్తే.. అప్పటికప్పుడు కడుపులోనే పిందాన్ని తుంచేస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఒక మాఫియాలా తయారైన ముఠా.. కేసులకూ భయపడడం లేదు. అధికారులూ సరైన చర్యలు తీసుకోకపోవడంతో వారి అరాచకానికి అడ్డూ అదుపులేకుండా పోయింది.

మహారాష్ట్ర నుంచి పెరిగిన తాకిడి

జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలోగల ఓ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు దర్జాగా నడుస్తున్నాయి. ఈ ఆస్పత్రికి దళారుల ద్వారా మహారాష్ట్ర నుంచి స్కానింగ్ కోసం వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దళారులు రోజూ మహారాష్ట్రకు చెందిన కార్లలో గర్భిణులను తీసుకువచ్చి స్కానింగ్ చేయిస్తున్నారు. రోజూ మహారాష్ట్ర పాసింగ్‌తో ఉండే కార్లు బస్టాండ్ ప్రాంతంలో కనీసం నాలుగైదు కనిపిస్తాయి. గర్భిణులను స్కానింగ్ కోసం తీసుకువచ్చే ఆ వాహనాలను బస్టాండ్, మున్సిపల్ ఆఫీస్ ప్రాంతాలలో రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నారు. వచ్చిన పని పూర్తయ్యిందని డ్రైవర్‌కు ఫోన్ రాగానే ఆస్పత్రికి సమీపంలోకి వెళ్లి వారిని వాహనంలో ఎక్కించుకుని తిరిగి వెళుతున్నారు. మన జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి లింగ నిర్ధారణ పరీక్షల కోసం వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగింది.

పట్టించుకోని పౌర సమాజం

జిల్లా కేంద్రంలో అడ్డగోలుగా నడుస్తున్న లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్ల వ్యవహారంలో పౌరసమాజం కూడా నోరు మెదపడం లేదు. సారా ఉద్యమం నుంచి మహిళల సమస్యల వరకు అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఉన్న స్థానిక మహిళా నాయకత్వం కూడా ఈ అక్రమ దందాపై స్పందించడం లేదు. జిల్లా కేంద్రంలో అనేక ప్రజా సంఘాలు ఉన్నా దుర్మార్గపు చర్యలను ఎండగట్టడంపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికే ఆడపిల్లల కొరతతో చాలా మంది యువకులకు పెళ్లి కాక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల భిక్కనూరు మండలంలో ఓ యువకుడు పెళ్లి కావడం లేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

ఇటీవల మహారాష్ట్రలో అబార్షన్‌కు సంబంధించిన కేసులో కామారెడ్డిలో స్కానింగ్ నిర్వహించినట్టు నిర్ధారణ కావడంతో అక్కడి పోలీసులు వచ్చి వైద్యుడిని అరెస్టు చేసి తీసుకువెళ్లారు. అయితే అక్కడి అధికారులను మేనేజ్ చేసుకుని సదరు వైద్యుడు తిరిగొచ్చాడు. అదే వైద్యుడి వద్ద లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన వ్యవహారాలను చూసుకున్న రాజంపేట మండల కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు సొంతంగా స్కానింగ్ దందా మొదలుపెట్టారు. ఇంటి వద్దకే మిషన్‌ను తీసుకువెళ్లి స్కానింగ్ చేస్తున్న విషయం తెలియడంతో పోలీసులు సదరు నిర్వాహకులను అరెస్టు చేశారు. అయితే రాజంపేట మండల కేంద్రంలో మొబైల్ స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసిన పోలీసులు.. జిల్లా కేంద్రంలో అడ్డగోలుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నవారిపై గట్టి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏదైనా చర్య మొదలుపెట్టగానే స్కానింగ్ నిర్వాహకులకు తెలిసిపోతోందంటే ఇంటి దొంగల వల్లేనని స్పష్టమవుతోంది.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అమరుల కుటుంబ సభ్యులు

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పోలీస్ అమరవీరులకు ఘన నివాళి
- అమరుల కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ

కామారెడ్డి క్రైం : పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇటీవల నిర్మించిన అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఏడుగురు పోలీసులు విధి నిర్వహణలో ఉండగా జరిగిన ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి త్యాగాల వల్లే ప్రస్తుతం పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తోందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉన్నప్పుడే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

అమరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. వారు అందించిన స్ఫూర్తితో శాంతి భద్రతల పరిరక్షణకు ముందుకు సాగుతున్నామన్నారు. విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. అమరుల కుటుంబాలకు సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడడం, మానసికంగా ధైర్యాన్ని ఇవ్వడమే అమరులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ ఆనెల 31 వరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్, వ్యాసరచన, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు 300 గజాల చొప్పున మంజూరైన ఇంటి స్థలాల పత్రాలను కలెక్టర్, ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్పీ సింధు శర్మ రక్తదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, యాకూబ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ జార్జ్, సీఐలు తిరుపయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్ కుమార్, సంతోష్ కుమార్, శ్రీనివాసులు, ఆర్‌ఐ నవీన్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, ఎస్‌ఐలు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




ఇళ్ల స్థలాల పత్రాలను అందిస్తున్న కలెక్టర్



రక్తదానం చేస్తున్న ఎస్పీ సింధుశర్మ

మిషిన్‌లో ఇంక్ లేదు.. కార్యాలయంలో పని కాదు..

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచిత్రం
- ఫ్రాంకింగ్ మిషిన్ పని చేయడం లేదంటూ బోర్డు ఏర్పాటు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాకేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వింత పరిస్థితి నెలకొంది. వివిధ పనులకు సంబంధించి కాగితాలపై స్టిక్కర్లను అతికించే ఫ్రాంకింగ్ మిషన్‌లో ఇంక్ అయిపోయింది. దీంతో పనులు చేయలేమని, సహకరించాలంటూ నోటీస్ బోర్డుపై రాసిపెట్టారు. ఆస్తుల మార్ట్‌గేజ్, ఎల్‌ఐసీ పాలసీదారుడు చనిపోయినపుడు క్లియరెన్స్‌కు సంబంధించిన పత్రాలు, అలాగే బ్యాంకుల్లో లాకర్లు తీసుకోవడం కోసం అవసరమైన పత్రాలపై ఫ్రాంకింగ్ మిషన్ ద్వారా రూ.వంద, అంతకు ఎక్కువ విలువైన స్టిక్కర్లను అతికిస్తారు. మిషన్‌లో ఇంక్ లేదంటూ పనులు ఆపేయడంతో ఆయా పనులపై కార్యాలయానికి వెళ్లిన వారు ఇబ్బందిపడుతున్నారు. పట్టణానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్యాలయానికి వెళ్లి, పనిజరగక ఉత్త చేతులతో రావలసి వచ్చిందని ఓ వ్యక్తి 'సాక్షి'తో పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

'ఓటరు నమోదుపై దృష్టి సారించాలి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు జాబితా సవరణ అంశాలపై సోమవారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్‌లతో మాట్లాడారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఓటర్ల నమోదుకు లక్ష దరఖాస్తులు, ఉపాధ్యాయ స్థానానికి 2,046 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో 7 వేల పట్టభద్రుల దరఖాస్తులు మాత్రమే విచారణ పూర్తయ్యిందన్నారు. దరఖాస్తుల పరిశీలనను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. వీడి యో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమావేశమై ఓటరు జాబితా రూపకల్పనపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల'ంలో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



ప్రజావాణి హాల్ వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

- విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన

కామారెడ్డి క్రైం: హాస్టల్‌లో వసతులు లేక తమ పిల్లలు పడుతున్న కష్టాలు చూసి తల్లిదండ్రులు చలించిపోయారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ఏకంగా కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చారు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేటలోని జ్యోతీబా పూలే బాలుర గురుకుల హాస్టల్‌లో 430 మంది విద్యార్థులున్నారు. అద్దె భవనంలో గురుకులం కొనసాగుతోంది. అయితే 250 మందికి సరిపోయే భవనంలో 430 మందిని ఉంచడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో సోమవారం సుమారు వందమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళన చేశారు. హాస్టల్‌లో కనీస గదులు, మరుగుదొడ్లు, బాత్రూంలు లేవని పేర్కొన్నారు. కిటికీలకు తలుపులు లేవని, ఫ్లోరింగ్ కూడా సరిగా లేదన్నారు. హాస్టల్ భవనం నిర్మించే వరకు వేరే భవనంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టుబట్టారు. పోలీసులు కలెక్టరేట్ బయటి గేట్లను మూసివేస్తుండడాన్ని గమనించి కొందరు లోపలికి చొచ్చుకువెళ్లారు. వారిని హాల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హాలు వద్ద బైఠాయించి సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని సముదాయించారు. ఐదుగురిని ప్రజావాణి హాలులోకి అనుమతించారు. వారు విద్యార్థుల బాధను కలెక్టర్‌కు వివరించారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సంగ్వాన్ వారికి భరోసా ఇచ్చారు. దీంతో వారంతా వెనుదిరిగారు.



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

డయాలసిస్ బాధితులకు ఏదీ 'చేయూత'?



పెన్షన్ ఇవ్వాలంటూ కలెక్టరేట్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

- జిల్లాలో 450 మందికిపైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు
- రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతున్న బాధితులు



కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో 450 మందికిపైగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. వీరంతా జిల్లా కేంద్రంలోని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, శ్రీ మెడికేర్ ప్రైవేట్ ఆస్పత్రి, అలాగే బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రులలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. కొందరికి వారానికి రెండుమూడుసార్లు కూడా డయాలసిస్ అవసరం అవుతోంది. ఇంకొందరు రాష్ట్ర రాజధానిలో వైద్య సేవలు పొందుతున్నారు. కిడ్నీలు ఫెయిల్ కావడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, డయాలసిస్ చేయించుకుంటూ ఆయుష్షును పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

సర్కారు ఆదుకుంటేనే..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైఎస్ భరోసా పథకంతో రూ. 10 వేల పెన్షన్ అందించారు. ఈ పథకం ఇప్పటికీ కొనసాగుతోంది. పక్క రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లుగానే ఇక్కడా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారికి పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. ప్రతి నెలా మందుల కొనుగోలు కోసం ఐదారు వేల రూపాయలు అవసరం అవుతున్నాయని బాధితులు పేర్కొంటున్నారు. కిడ్నీలు పనిచేయకపోవడంతో ఎలాంటి పనులు చేయలేకపోతున్నామని, కుటుంబం గడవడమూ కష్టంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 2018లో దరఖాస్తు చేసుకున్న 30 మందికి మాత్రం నెలకు రూ. 2 వేల చొప్పున పింఛన్ అందుతోంది. మిగతా వారికి ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదు. రూ. 10 వేల పెన్షన్ అందించాలని బాధితులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నం



నాకు రెండేళ్ల క్రితం కిడ్నీ చెడిపోయింది. డయాలసిస్ చేయించుకుంటున్నా. నెలకు మందులకే రూ. 5వేలు అయితున్నయి. డబ్బులకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మాకు ప్రభుత్వం పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి. – స్వరూప, రామారెడ్డి

పెన్షన్ ఇవ్వాలి



రెండు కిడ్నీలు చెడిపోయాయి. మా అమ్మ కిడ్నీ ఇచ్చింది. ఆపరేషన్‌కు, మందులకు రూ. 40 లక్షలకుపైగా ఖర్చయ్యాయి. ప్రస్తుతం కుటుంబం గడవడమూ కష్టంగా ఉంది. ప్రభుత్వం నెలకు రూ. 10 వేల పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి. – బౌమిక్, కామారెడ్డి

ఆంధ్రాలో ఇచ్చినట్లుగా..



రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సీఎంగా ఉన్నప్పుడు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైఎస్ భరోసా పథకం కింద రూ. 10 వేల ఫించన్ ఇచ్చారు. ఆ పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలి. – సత్యనారాయణ, పోసానిపేట

ప్రభుత్వం ఆదుకోవాలి



కిడ్నీ ఫెయిలవడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం. శారీరకంగా, మానసికంగానే కాకుండా ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రూ. 10 వేల పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలి. – శ్రీధర్, గొట్టిముక్కుల, దోమకొండ

క్లుప్తంగా

వర్షంలోనూ విద్యుత్తు మరమ్మతులు

- ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందిని అభినందించిన స్థానికులు



గాంధారి(ఎల్లారెడ్డి): రాత్రి వేళ వర్షంలోనూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ట్రాన్స్‌కో సిబ్బంది స్థానికుల నుంచి మన్ననలు పొందారు. ఆదివారం రాత్రి గాలి వాన రావడంతో మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో వ్యవసాయ క్షేత్రాల్లో 33 కేవీ విద్యుత్తు తీగలు తెగిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం తెలుసుకున్న ట్రాన్స్‌కో డీఈ విజయ సారథి, ఏడీఈ మల్లేష్, ఏఈ లక్ష్మణ్ బృందం సిబ్బందితో కలిసి వెళ్లి లైన్‌ను తనిఖీ చేశారు. తుమ్మళ్ల శివారులో తీగలు తెగిపోయి అంతరాయం ఏర్పడినట్లు గుర్తించారు. వెంటనే బ్యాటరీల వెలుతురు సహాయంతో తీగలను అమర్చి సరఫరాను పునరుద్ధరించారు. లైన్‌మెన్‌లు కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి సిబ్బంది ఉన్నారు.



నేడు బహిరంగ విచారణ

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రతిపాదనల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఉదయం 10.30 గంటలకు విద్యుత్ టారీఫ్‌పై బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలపై బహిరంగ విచారణ ఉంటుందన్నారు. విచారణకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యుత్ వినియోగదారులు బహిరంగ విచారణకు హాజరు కావాలని ఎస్ఈ కోరారు.

పరిష్కార మార్గాలు చూపాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 56 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 56 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే దరఖాస్తులపై వెంటనే పరిశీలన జరపాలన్నారు. సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో సురేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త నిబంధనలు తొలగించాలి

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలు తొలగించాలని కోరుతూ జిల్లాకు చెందిన సింగిల్ విండో చైర్మన్లు, సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. 24 సీజన్లుగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను కొనసాగిస్తున్నామని, గతంలో ఉన్న నిబంధనలతో ఎలాంటి ఇబ్బంది రాలేదని, ఈ సారి సివిల్ సప్లయ్ అధికారులు కొన్ని కొత్త నిబంధనలు తీసుకువచ్చారని తెలిపారు. గోనె సంచులను తిరగేసి నింపాలని, సన్న రకం ధాన్యం నింపేటప్పుడు గోనె సంచిపై ఎస్ అనే అక్షరం వచ్చేలా ఎర్ర రంగుతో, దొడ్డు రకం సంచులకు ఆకుపచ్చ రంగుతో కుట్లు వేయాలని, జిల్లా కోడ్ వచ్చేలా టెన్సిల్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. సన్నాల విషయంలో మిల్లర్లు తరుగు తీసివేస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి నిబంధనలు తీసేయాలని డిమాండ్ చేశారు.

రాజంపేటలో రెండు ఫిర్యాదులు



రాజంపేట: స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు అందినట్లు మండల తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాడ్వాయి, పిట్లంలలో ఫిర్యాదులు నిల్



తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తాడ్వాయి తహసీల్దార్ రహీమొద్దీన్, పిట్లం తహసీల్దార్ వేణుగోపాల్ వేర్వేరుగా తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ఎంపీడీవోలు సయ్యద్ సాజిద్‌అలీ, కమలాకర్, పిట్లం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



ఎం.ఈశ్వర్



ఆర్.సెహ్వాగ్



కె.ప్రవీణ్

కామారెడ్డి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు నలుగురు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన చేసి బంగారు, వెండి పతకాలు సాధించినట్టు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. ఎం.ఈశ్వర్ వంద మీటర్ల మిక్స్‌డ్ రిలే పోటీల్లో బంగారు పతకం, ఆర్.సెహ్వాగ్ నాలుగు వందల మీటర్ల రిలే పోటీలో వెండి పతకం, ట్రయాథ్లాన్–సిలో కె.ప్రవీణ్ వెండి పతకం సాధించారు.

ప్రజావాణికి 82 ఫిర్యాదులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు కష్టం క‘న్నీటి’ పాలు



భవానీపేట కొనుగోలు కేంద్రంలో వర్షం నీటి నుంచి ధాన్యం సేకరిస్తున్న రైతులు



రోడ్డుపై కొట్టుకుపోయిన ధాన్యం సేకరిస్తున్న రైతులు



కొండాపూర్ కల్లంలో వరదలా పారుతున్న వర్షం నీరు



మహమ్మద్ నగర్ కొనుగోలు కేంద్రం వద్ద పరిస్థితి



కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షాలకు నీటిపాలవుతోంది. పంట నూర్పిడి చేసి ఆరబెట్టేందుకు రోడ్డుపై ఉంచిన ధాన్యం సోమవారం జిల్లాలో కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయింది. ప్రతి రోజూ వర్షం కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మూడు నాలుగు రోజుల నుంచి ఆరబెట్టిన ధాన్యం తడవడంతో రైతులు దిగులుచెందుతున్నారు. వర్షానికి చాలా రాశుల్లో ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం నీరు నిల్వ ఉండడంతో వాటిని తొలగించడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగింది.

– సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయి మండలం కన్‌కల్‌లో నేలకొరిగిన వరి పంట



వర్షానికి భయపడి తిమ్మాపూర్‌లో ధాన్యం కుప్పలపై పట్టాలు కప్పిన దృశ్యం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పేట్‌సంగెం విద్యార్థినులు బానోత్ ఉష, కొర్రి సృజన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఈ నెల 29 నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా బెల్లంపల్లిలో జరిగే పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పీఈటీ వెల్లడించారు.

పాల్వంచ విద్యార్థి..



మాచారెడ్డి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్ఆర్ టాలెంట్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని సన్నిక ఎంపికైంది. విద్యార్థినిని పాఠశాలలో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, పీఈటీ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..



భిక్కనూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని చందన ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ సోమవారం తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో చందన పాల్గొంటుందన్నారు. చందనను సోమవారం అభినందించారు. హెచ్‌ఎం శ్రీనాథ్, పిజికల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తమ్మళి రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ

రుద్రూర్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీ తాళం పగులగొట్టి అందులోని డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు రాజేశ్వరప్ప పోలీసులకు సమాచారం అందించారు. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. పోలీసులు ఆలయాలపై నిఘాసారించి చోరీలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

గోదావరిలో ఒకరి గల్లంతు



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో ఓ వ్యక్తి గల్లంతైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్‌లోని పోస్టాఫీసు ఏరియాకు చెందిన విభూది మాధవ్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి నదీ స్నానాలకు వచ్చారని పేర్కొన్నారు. నదిలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడని, మాధవ్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



వర్ని: కర్నాటక రాష్ట్రంలోని చిక్లి గ్రామానికి చెందిన మడివాడు సంజీవ్(45) అనే వ్యక్తి మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంజీవ్ టైలరింగ్ చేస్తూ చందూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన సోమవారం మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం కేసులో ఐదుగురి అరెస్ట్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి ఆటోలో మహిళను తీసుకువెళ్లి డిచ్‌పల్లి ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి అంబేడ్కర్ నగర్‌కు చెందిన జైనొద్దీన్ ఖురేషీ, ఘన్‌పూర్ గ్రామంలోని ఇస్లాంపురాకు చెందిన మోసీన్ ఖురేషీ, మిట్టాపల్లికి చెందిన మహ్మద్ సుల్తాన్, నాగేపూర్ గేట్ ప్రాంతానికి చెందిన నగేశ్ చీలంకర్, నడిపల్లికి చెందిన షేక్ రఫీక్ ఈ నెల 18న రాత్రి ఓ మహిళను నిజామాబాద్ బస్టాండ్ నుంచి ఆటోలో తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మొరం టిప్పర్ పట్టివేత

మోపాల్: మండల కేంద్రం నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు భూగర్భ గనులశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌కు జరిమానా విధించనున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎడపల్లి(బోధన్): మండలంలోని అంబం గ్రామానికి చెందిన నేరడి నర్సవ్వ గతవారం రోజులుగా కనిపించడం లేదని ఆమె కుమార్తె అనిత సోమవారం ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన తల్లి వారం క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని ఆమె ఆచూకీ లభించడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

పెళ్లి చేయడం లేదని తండ్రి హత్య

- సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- నవీపేట మండలం అనంతగిరిలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి సోదరి



గౌరు అమృతం (ఫైల్)

నవీపేట: తనకు పెళ్లి చేయడం లేదని, తాను దుబాయిలో ఉన్న సమయంలో పశువులను అమ్మేశాడనే కక్షతో తండ్రిని కొడుకు హత్య చేశాడు. సహజమరణంగా నమ్మించే ప్రయత్నం చేసి దొరికిపోయాడు. నవీపేట మండలం అనంతగిరి గ్రామంలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గౌరు అమృతం(55) కుమారుడు గౌరు మహిపాల్ ఇటీవలే దుబాయి నుంచి గ్రామానికి వచ్చాడు. తల్లి లక్ష్మి గొట్టుముక్కలలో వేరుగా ఉంటోంది. ఏడాది కిందట మహిపాల్‌కు చెందిన పశువులను అమృతం అమ్ముకున్నాడు. తల్లిని వేరుగా ఉంచడం, తనకు పెళ్లి చేయకపోవడం, పశువులు అమ్ముకోవడంతో తండ్రిపై మహిపాల్ కక్ష పెంచుకున్నాడు. అతడిని ఎలాగైనా చంపాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తండ్రీకొడుకులు మద్యం సేవించారు. అమృతం మత్తులోకి జారుకోవడంతో అతడి గొంతుకు మహిపాల్ టవల్ బిగించి హత్య చేశాడు. సోమవారం ఉదయం ఆర్‌ఎంపీని పిలిపించి తన తండ్రి లేవడం లేదని చూపించగా చనిపోయినట్లు అతుడు ధ్రువీకరించాడు. అమృతానిది సహజ మరణంగా చిత్రీకరించిన మహిపాల్ బంధువులకు సమాచారమిచ్చాడు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అమృతం మెడపై గాయాలను గమనించిన అతడి సోదరి సావిత్రి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మహిపాల్‌ను విచారించగా తండ్రిని తానే చంపినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

వేర్వేరు కేసుల్లో నలుగురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: న్యూసెన్స్ చేసిన కేసులో నగరంలోని హమాల్‌వాడికి చెందిన సంఘీ రమేశ్‌వర్మకు న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఈనెల 20న రమేశ్‌వర్మ తన తమ్ముడి భార్యతో గొడవపడి రోడ్డుపై న్యూసెన్స్ చేయడంతో అతడిపై 70బీ, 70 సీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సోమవారం మార్నింగ్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా న్యూసెన్స్ చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన వ్యక్తికి..

బోధన్‌టౌన్(బోధన్): డయల్ 100ను దుర్వినియోగం చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసిన పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శేషతల్ప సాయి తీర్పునిచ్చారని సీఐ వెంకటనారాయణ తెలిపారు. నిందితుడిని సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచామన్నారు. డయల్ 100ను దుర్వినియోగం చేయొద్దని ఆయన ప్రజలను కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో..

బోధన్‌టౌన్(బోధన్): మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా, మరో ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శేషతల్ప సాయి సోమవారం తీర్పును వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ ముగ్గురు పట్టుబడగా, వారిని సీఐ వెంకటనారాయణ కోర్టులో హాజరుపర్చారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు.

పేలుడు పదార్థాల కేసులో మూడేళ్లు..

ఖలీల్‌వాడి: ప్రభుత్వ అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు కలిగి ఉన్న కేసులో గండికోట మల్లయ్య అనే వ్యక్తికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తరఫున ప్రాసిక్యూషన్ నిర్వహించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భీమ్‌గల్ పోలీసులు 2014 మే 11న మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ట్రాక్టర్‌లో 200 డిటోనేటర్లు, వైర్లు దొరికాయి. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించి కామారెడ్డి జిల్లా జంగంపల్లి గ్రామానికి చెందిన గండికోట మల్లయ్యవిగా గుర్తించారు. అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ ముద్దాయిపై పేలుడు పదార్థాలు కలిగి ఉన్న నేరారోపణలు రుజువైనట్లు నిర్ధారిస్తూ గండికోట మల్లయ్యకు మూడేళ్ల కఠిన జైలుశిక్ష విధించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి



రాములు (ఫైల్)

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లికి చెందిన రైతు నల్లాల రాములు (57) సోమవారం పాముకాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాములు గ్రామ శివారులోని తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో పాము కాటువేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి..

పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మద్దెల సాయిలు(42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 19న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కులస్తుని అంత్యక్రియలు పూర్తయిన తరువాత సాయిలు స్నానం చేసేందుకు చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగిపోయాడు. సోమవారం ఉదయం 7 గంటలకు చెరువులో మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు మృతుడి భార్య పోచవ్వకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ వద్ద కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ సోమవారం తెలిపారు. గంగస్థాన్ వైపు వెళ్తున్న ఐ20 కారుకు భిక్షాటన చేసే వ్యక్తి ఎదురుగారావడంతో ప్రమాదం జరిగిందని, మృతుడి వయస్సు 60 నుంచి 70 ఏళ్ల ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కోసం 87126 59849 నంబర్‌ను సంప్రదించలన్నారు.

రైలు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు..



విజయ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దర్జీ విజయ్‌కుమార్ (42) సోమవారం కామారెడ్డిలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌కుమార్ మండలంలోని మత్తమాల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల ప్రమోషన్‌పై మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేటకు బదిలీ అయ్యారు. అక్కడ విధులను నిర్వర్తిస్తున్న విజయ్‌కుమార్ సోమవారం రైలు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.